

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఇచ్చోడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్‌టీఐ చీఫ్ కమిషనర్ గోపిడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇచ్చోడ మండలంలోని బోరిగామ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను తన చిన్నప్పుడు ఇదే పాఠశాలలో చదువుకున్నానని అప్పటికీ.. ఇప్పటికీ.. పాఠశాల చాలా అభివృద్ధి చెందిందని, ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామస్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటారు.



బరంపూర్ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మొక్కలు నాటుతున్న శిక్షణ కలెక్టర్లు

ముగిసిన శిక్షణ అధికారుల పర్యటన

నేరడిగొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో కుమారి గ్రామ క్షేత్ర పర్యటనకు వచ్చిన సివిల్ సర్వీస్ శిక్షణ అధికారుల పర్యటన మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మండలంలోని కుమారి గ్రామాన్ని గత నాలుగు రోజుల నుంచి ఇంటింటా సర్వే నిర్వహించి ప్రభుత్వ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. చివరి రోజు స్థానికుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు వారిని సన్మానించారు. ఎంపీడీవో శేఖర్, ఎంపీవో శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

బరంపూర్ వెంకన్న దర్శనం

తలమడుగు: మండలంలోని బరంపూర్ కొండపైన ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం జిల్లాకు వచ్చిన శిక్షణ కలెక్టర్లు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ చుట్టుకొండలు పచ్చని వాతావరణం మనిషికి ఆధ్యాత్మికతో పాటు ఆలయంలో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. ఇందులో ఎంపీడీవో శంకర్, ఎంపీవో వినోద్ కుమార్, ఆర్ఐ అశోక్, ఆలయ కమిటీ చైర్మన్ ముడుపు కేదారేశ్వర రెడ్డి, ఆలయ పూజారి స్వస్తిక్ స్వామి, ఆలే కమిటీ సభ్యులు, తదితరులున్నారు.

కోటి దీపోత్సవం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మార్వాడీ ధర్మశాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా కోటి దీపోత్సవంగోడ ప్రతులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్ర, సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, సమితి సభ్యులతో కలిసి కాన్ఫరెన్స్ హాల్‌లో గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈనెల 10వ తేదీన సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు మార్వాడీ ధర్మశాలలో నిర్వహించే దీపోత్సవంలో పూజా సామగ్రి ఉచితంగా అందించనున్నట్లు సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి తెలిపారు. ఉచిత పాసులు శుక్రవారం సాయంత్రం నుంచి అందిస్తున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయండి

బోథ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి వచ్చే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి జాదవ్‌గణేష్ పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి కళాశాలకు వచ్చే విధంగా చూడాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలి

ఆదిలాబాద్(సిరికొండ), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చలికాలం దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలి అని సీడీపీవో వినూత్న సూచించారు. మంగళవారం మండలంలోని అంగన్వాడీ కేంద్రాల 1, 2లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహణ, పరిశుభ్రత, విద్య, ఆరోగ్య సేవలు, చిన్నారుల హాజరు మరియు పౌష్టికాహారం సరాఫరా, నిల్వలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. సూపర్‌వైజర్ శారద, అంగన్వాడీ టీచర్లు రాణి, సుప్రియ ఉన్నారు.



● మావల ఎక్స్‌రోడ్డు వద్ద ప్రమాదకరంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు

ప్రయాణం.. ప్రాణ సంకటం!

- జిల్లాలో 44వ జాతీయ రహదారిపై 11 డెత్ స్పాట్లు
- ప్రతియేటా పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు
- రహదారి నిర్మాణంలో అడుగడుగునా లోపాలు
- ప్రయాణికులకు కరువవుతున్న భద్రత
- చేవేళ్ల బస్సు ప్రమాదంతో భయంభయంగా ప్రయాణం
- రహదారి నిర్మాణ సంస్థ, హైవే అధికారుల నిండు నిర్లక్ష్యం

జిల్లా మీదుగా.. వెళ్తున్న 44వ జాతీయ రహదారి యమడేంజర్‌గా మారింది. దీంతో నిత్యం రాకపోకలు జరిపే ప్రజలకు ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందంటున్నారు. నేరడిగొండ మండలం ఆరెపల్లి వద్ద మొదలైన రహదారి జైనథ్ మండలం డొల్లార వరకు సుమారుగా 85 కి.మీ.లు వెళ్తుంది. రహదారిని ఆనుకుని ఉన్న నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, మావల, జైనథ్ మండలాల పరిధిలో నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉండడం గమనార్హం.

నేషనల్ హైవే యమడేంజర్

ఆదిలాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిత్యం జిల్లాకేంద్రం నుంచి నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్ పట్టణాలతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు రహదారి మీదుగా బస్సు సర్వీసులను నడుపుతున్నారు. రహదారి నిర్వహణ కంపెనీలు భద్రత చర్యలను గాలికి వదిలేయడంతో రెప్పపాటులోనే ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. సుదూర ప్రయాణం సుఖవంతమయ్యేలా నాలుగు వరుసల రహదారిని నిర్మించినా.. మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల జరిగిన చేవేళ్ల బస్సు ప్రమాదంతో రహదారిపై ప్రయాణించేందుకు ప్రయాణికులు జంకుతున్నారు. రహదారి నిబంధనలపై వాహనదారులకు ఏమాత్రం అవగాహన లేకపోవడంతో తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. యేటా ఎందరో మంది రోడ్డు ప్రమాదాల బారీన పడి మృతి చెందడంతో బాధిత కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నాయి. అయితే జిల్లాలో నేషనల్ హైవే అధికారులు ప్రయాణికులకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు లేక పోలేదు.

ప్రాణాలు తీస్తున్న బ్లాక్ స్పాట్‌లు

44వ జాతీయ రహదారిపై 11 బ్లాక్ స్పాట్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. అయినా అధికారులు ఎక్కడా భద్రత చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. జిల్లా పరిధిలోని రహదారిపై ఐదు చోట్ల మాత్రమే వాహనాల పార్కింగ్‌కు అనుమతి ఉంది. కానీ హైవే అధికారుల నిర్లక్ష్యంతో రహదారిపై ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. రోడ్డు పైననే అడ్డదిడ్డంగా భారీ వాహనాల ను నిలుపడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నేరడిగొండ మండల కేంద్రానికి సమీపం, కోర్టికల్ గ్రామం వద్ద అలాగే ఇచ్చోడ మండలం పెట్రోల్ బంక్ ముందు, గుడిహత్నూర్ మండలం సీతాగొంది పెట్రోల్‌బంక్ పక్కన, జైనథ్ మండలం రిలియన్స్ పెట్రోల్‌బంక్ ముందు మాత్రమే వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు. కానీ సీతాగొంది దాబాల ముందు ఎలాంటి పార్కింగ్ స్థలం లేకపోయినా విచ్చలవిడిగా రోడ్డు పైననే వాహనాలను నిలుపుతున్నా.. పెట్రోలింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా రోడ్డుపై హెచ్చరిక బోర్డులు లేకుండానే ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.



ఇటీవల కుప్టి ఘాట్ వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు(ఫైల్)

నిలిపిన వాహనాలతోనే ప్రమాదం

రోడ్డుపై నిలిపిన వాహనాలతోనే ఎక్కువగా ప్రమాదా లు జరుగుతున్నాయి. అయిన అధికారులు చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితేనే హడావిడి చేయడం.. ఆ తర్వాత అంతా మాములుగానే మారిపోతుంది. ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. రహదారి నిర్వహణ కంపెనీ కూడా రోడ్డు భద్రతను గాలికి వదిలేస్తున్నాయి. అధికారులు రహదారి నిర్వహణ కంపెనీలతో కుమ్మకై ప్రజల ప్రాణాలతో

(తరువాయి 4వ పేజీలో....)

పశువులన్నింటికీ టీకాలు తప్పనిసరి: జిల్లా అధికారి



దేవాపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి

తలమడుగు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల రైతులందరూ తమ పశువులకు తప్పనిసరి గాలికుంటూ టీకాలు వేయించుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ రామారావు అన్నారు. గాలి కుంటూ టీకాల కార్యక్రమంలో మంగళవారం మండలంలో దేవాపూర్ లో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ చలికాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తుగా పశువులన్నిటికీ తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 70 శాతం పశువులకు టీకాలు వేయించడం జరిగిందన్నారు. ఇందులో మండల వైశ్య వైద్యాధికారి డాక్టర్ లావన్య, పశు వైద్య సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్‌లపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కరువు'

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీసీలకు రిజర్వేషన్‌లకు రిజర్వేషన్‌లు కల్పించడంలో ప్రభుత్వాలు మోసం చేస్తూ వస్తున్నాయని బీసీ, ఎస్సీ ఎస్టీ జిల్లా కోఆర్డినేటర్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి, బీసీ, ఎస్సీ ఎస్టీ జేఏసీల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శ్యామల దేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అగ్గిమళ్ల గణేష్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం నుంచి నేటి వరకు బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయని, చట్టబద్ధత కల్పించకుండా బీసీలకు న్యాయం జరగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌లు ఏ చట్ట బద్ధత లేకుండా ప్రకటించడం, న్యాయ స్థానాల్లో ఈ రిజర్వేషన్‌లు చెల్లవని తెలిసి చేసిన ప్రకటననే అని అన్నారు. రిజర్వేషన్ లను 9వ షెడ్యూల్ లో చేర్చాలని, విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషనులు అమలు పర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సామల ప్రశాంత్, బీసీ ఐక్య సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధ్యారంగుల గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

అర్హులకు సంక్షేమ ఫలాలు

- ఐటీడీఏ నూతన ఇన్‌చార్జి పీవో యువరాజ్ మర్మాట్



ఇన్‌చార్జీ పీవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న పరిపాలనా అధికారి

ఉట్నూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా యువరాజ్ మర్మాట్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఉట్నూర్ గిరిజన అభ్వృద్ధి సంస్థ పరిధిలోని అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అందేవిధంగా అధికారులు సమన్వయంతో కృషి పని చేయాలని ఆయన అన్నారు. ఉట్నూర్ సబ్ కలెక్టర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏలోని వివిధ విభాగాలలో పని చేస్తున్న శాఖాధిపతులతో అధికారులతో మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ గిరిజనుడికి అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని అన్నారు. అర్హులకు అందేవిధంగా సమన్వయంతో కృషి చేయాలని అధికారులకు సూచించారు.

ఇన్‌చార్జి పీవోకు సన్మానాల వెల్లువ

ఉట్నూర్: ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన యువరాజ్ మర్మాట్‌కు పలువురు సన్మానాలు చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో పాటు గిరిజన సంక్షేమ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం, గిరిజన సంక్షేమ దినసరి ఉద్యోగుల సంఘం, బీఆర్ఎస్ నాయకులు, రిటైర్డ్ ఈఈ రాథోడ్‌భీమ్ రావు, రెవెన్యూ సిబ్బంది, ఐటీడీఏ సిబ్బంది పూలబొకేలు అందించారు. ఈ సందర్భంగా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ పక్షాన మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.



పీవో సన్మానిస్తున్న గిరిజన సంక్షేమ నాలుగో తరగతి ఉద్యోగులు

కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా వెల్లడి

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లపై జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో పత్తి కొనుగోళ్లు సజావుగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యజమానులు, మార్కెటింగ్, వ్యవసాయ, రవాణా, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో పత్తి కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు నవంబరు 6వ తేదీ నుంచి నిరవధికంగా మూసివేయనున్నట్లు తెలంగాణ కాటన్ జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ ప్రకటించిన నేపథ్యంలో, జిల్లా స్థాయిలో పరిస్థితులను సమీక్షించామని తెలిపారు. సీసీఐ వారు జిన్నింగ్ మిల్లులకు జాబ్ వర్క్ కేటాయింపును ఎల్1, ఎల్2 విధానంలో నిర్వహించడం పట్ల మిల్లుల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారని, ఈ అంశంపై జిల్లా స్థాయి కమిటీ చర్చించి అభిప్రాయాలను రాష్ట్రస్థాయికి నివేదించనున్నట్లు ఆయన వివరించారు. అలాగే, రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, విశ్రాంతి ఏర్పాట్లు, పారదర్శకతకు కట్టుబడి ఉండాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, అదనపు ఎస్పీ సురేందర్ రావు, మార్కెటింగ్ అధికారి గజానన్, జిన్నింగ్ మిల్లుల యజమానులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): ఆస్పత్రులు, వెటర్నరీ హాస్పిటల్స్, పరిశ్రమల్లో ఉత్పత్తి అయ్యే మానవ, రసాయన వ్యర్థాలను సాధరణ చెత్తలో కలపరాదని కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో బయో మెడికల్ వెస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 అమలుపై జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బయో మెడికల్ వ్యర్థాలను గుర్తింపు పొందిన సంస్థల ద్వారా మాత్రమే శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేయాలని సంబంధిత విభాగాల అధికారులకు సూచించారు. ఇందులో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా.నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన తప్పనిసరి

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్సీ స్టడీ సర్కిల్‌లో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వివిధ సంక్షేమ పథకాలపై నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.

విద్యార్థినులకు అండగా పోలీస్ అక్క ప్రారంభం

కలుషిత నీటిపై సత్వర చర్యలు

వివరాలు 7వ పేజీలో....



ఆదివాసీ అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళులర్పిస్తున్న కవిత

సామాజిక తెలంగాణ సాధనకు ఏకం కావాలి

- జాగృతి జనంబాటలో కవిత

వివరాలు 6వ పేజీలో....



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు

బిల్లులు మంజూరు చేయకుంటే పనులు చేయలేం : బిల్డర్స్ అసోసియేషన్

ఆదిలాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయకుంటే ఎలాంటి పనులు చేయలేమని బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. మంగళవారం కలెక్టర్ రాజార్షిషాతో పాటు పంచాయతీరాజ్ ఎస్ఈ జాదవ్‌ప్రకాష్‌కు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.రామారావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి బిల్లులు అందక పోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కొత్త పనులను చేయలేక పోతున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే డిసెంబరు 1 నుంచి పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులను నిలిపి వేస్తామని పేర్కొన్నారు. ఇందులో కాంట్రాక్టర్స్ గుట్టనవీన్, ఎస్.కృష్ణారావు, గాజుల సదానంద్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం ముక్రా(కె) గ్రామం: ఎంపీడీవో

ఇచ్చోడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్రా(కె) గ్రామ అభివృద్ధి అద్భుతమని ఎంపీడీఓ నరేష్ అన్నారు. మంగళవారం ముక్రా (కె) గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో సేంద్రీయ ఎరువుల తయారీ, సోలార్ ప్లాంట్, పల్లె ప్రకృతి వనం, పార్క్, వైకుంఠధామం, నర్సరీ, గ్రామపంచాయితీ భవనం తదితర వాటిని పరిశీలించి గ్రామాభివృద్ధి బాగుందని ప్రశంసించారు. ఇందులో మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, ఎంపీవో సదానంద్, ఏపీవో నరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

18 శాతం తేమతో కొనుగోలు చేయాలి

తలమడుగు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున పత్తికి అధిక తేమశాతం వస్తుందని, ప్రభుత్వం స్పందించి 18 తేమశాతంతో ఎకరానికి 12 కుంటలతో పత్తి పంటను కొనుగోలు చేయాలని మంగళవారం తలమడుగు తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు కాలం రైతుల పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు కొర్రీలు పెడుతుందన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున పత్తికి తేమ ఎక్కువ వస్తుందని, ప్రభుత్వం సీసీఐ స్పందించి 12 శాతం తేమతో పాటు ఎకరానికి 12 కుంటాల పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం వరి పంటకు 500 బోనస్ ఇస్తున్నందున మిగతా పంటలన్నిటికీ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన పంటలన్నిటికీ ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. ఇందులో భూమారెడ్డి, కాటిపేలి వెంకట్ రెడ్డి. ప్రకాష్ రెడ్డి, కటి పెల్లి శ్రీనివాస్ రెడ్డి, వినోద్ రెడ్డి, మోడపు ఉషన్న, నరేందర్ రెడ్డి, రానవిర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ కొలువులు కాంగ్రెస్‌తోనే సాధ్యం

తలమడుగు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు సర్కారు కొలువులు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో నీ గ్రూప్-2లో కోపరేటివ్ సోసైటీలో ఆసిస్టెంట్ రీజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరిన తలమడుగుకు చెందిన వడ్నాల లక్ష్మణరావు కూతురు స్వప్నని సన్మానించి అభినందించారు. వారిలో జిల్లా లైబ్రరీ చైర్మన్ మల్లెపూల నరసయ్య, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మోహన్, తదితరులు ఉన్నారు.

సామాజిక తెలంగాణ సాధనకు ఏకం కావాలి

● జాగృతి అధ్యక్షురాలు కవిత

ఇంద్రవెల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సామాజిక తెలంగాణ సాధనకు అందరూ ఏకం కావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామాన్ని సందర్శించారు. నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్ ఆధ్వర్యంలో కవితకు ఘన స్వాగతం పలికారు. ఆదివాసీ ఆరాధ్య దైవం నాగోబా ఆలయంలో దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన అమరవీరుల స్తూపానికి ఘన నివాళులు అర్పించారు. ఆదివాసీ నాయకులతో కలిసి స్మృతి వనంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణలో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సంఘాల నాయకులు కొట్నాక్ బారిక్ రావు, ఆదివాసీ గిరిజన అమరవీరుల ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు తొడసం నాగోరావు, తదితరులున్నారు.

రిమ్స్‌ను సందర్శించిన కవిత

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): రిమ్స్ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలందించడమే కాకుండా ప్రజలకు తగు సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రిమ్స్ ఆస్పత్రిని మంగళవారం ఆమె సందర్శించారు. ఆస్పత్రిలోని పలు వార్డుల్లో కలియతిరుగుతూ రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, ఇతరత్రా అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ వివరించారు. అనంతరం కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అంతకుముందు స్థానిక గ్రంథాలయాన్ని పరిశీలించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులతో మాట్లాడి... స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.



రిమ్స్‌ను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కల్వకుంట్ల కవిత



రుయ్యాడిలో బాధిత రైతు కుటుంబ సభ్యులను ఓదారుస్తూ..

ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఆత్మహత్యలు

తలమడుగు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, రైతులకు భరోసా కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు ప్రేమేందర్ కుటుంబ సభ్యులను కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారి ఆమె పేర్కొన్నారు.

ఎంపీని కలిసిన పాట్నాపూర్ గ్రామస్థులు

బోథ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధికి సహకరించాలని గ్రామపెద్దలు మంగళవారం ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్‌ను కలిసి విన్నవించారు. గ్రామ అభివృద్ధికి గతం నుంచి సహకరిస్తున్నారని, భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ గ్రామ అభివృద్ధి కోసం తనవంతు కృషి ఎళ్లవేళలా ఉంటుందన్నారు.

విద్యార్థులకు పొదుపుపై అవగాహన

ఉట్నూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొదుపు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రవికుమార్ మంగళవారం విద్యార్థులకు పొదుపుపై అవగాహన కల్పించారు. బ్యాంకు క్యాషియర్ వెన్నెల పాల్గొన్నారు.

'ఆర్ఎస్ఎస్‌ను బ్యాన్ చేయండి'

లఇంద్రవెల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను బ్యాన్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్ పిలుపుకు మద్దతుగా మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మండల దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నెలకొన్న శాంతి, భద్రతలకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌దే బాధ్యత అని విమర్శించారు. ఇందులో కాంబ్లే రాజేందర్, సౌన్ కాంబ్లే బాబాసాహెబ్, ఝూమ్రే లక్ష్మీకాంత్, సూర్యవంశీ ఉత్తం, సోన్ కాంబ్లే జితేందర్, పరత్ వాగ్ దత్త, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ఆదిలాబాద్(మావల), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం కళాశాలలో 2025 బ్యాచ్ మొదటి విద్యార్థులకు రెండవ సంవత్సరం విద్యార్థులు ఆహ్వానం పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

ఉట్నూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేసి బీసీలకు న్యాయం చేయాలని బీసీ పోరాట కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీసీ పోరాట కమిటీ కన్వీనర్ సీపతిలింగాగౌడ్ మాట్లాడుతూరాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమిషన్‌లలో నామినెటెడ్ పోస్టుల భర్తీలో కూడా 42శాతం అమలు చేసేలా కృషి చేయాలని కోరారు. కో కన్వీనర్ కందుకూరి రమేష్, కట్ట లక్ష్మణచారి, షికారి శ్రీనివాస్, బింగి వెంకటేష్, దావులేబాలాజి, గొల్లపల్లి శ్రీనివాస్, సాడిగే రాజేశ్వర్, బొడ్డు రాము, చింతల రమణ, పొన్నం జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి

బోథ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కౌట(బి) గ్రామాన్ని సందర్శించి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో తప్పనిసరిగా సామూహిక ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని, దీంతో పాఠశాలలో భవిష్యత్తులో బోరుబావుల్లో నీరు నిల్వ ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి షకీల్, ఈసీ మధుకర్ ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

బోథ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల చెందిన విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వీధులను శుభ్రం చేసి మురికి కాలువలలో పెరిగిన మొక్కలను చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు మూఢ నమ్మకాలు, పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. గ్రామంలో 50 మొక్కలను నాటడం జరిగిందని ప్రోగ్రాం ఆఫీసర్ నగేష్ తెలిపారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం!

(3వ పేజీ తరువాయి...)

చెలగాటమాడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రహదారి పైననే మరమ్మతుల పేరిట భారీ వాహనాలను నిలుపుతున్నా.. రోజుల తరబడి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నా యి. ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అలాగే కొన్ని గ్రామాల సమీపంలో ప్రమాదకరంగా పశువుల సంచారం, ఎడ్లబండ్లు, రోడ్డును దాటుతున్న పట్టించుకోవడం లేదు. అలాగే మితిమీరిన వేగం, పరిమితికి మించిన ప్రయాణంతో ఆటోలు రహదారిపై వెళ్తున్న అడ్డుకునే వారే కరువవుతున్నారు. అతివేగంతో వాహనాలు వెళ్లే మార్గంలో అకస్మాత్తుగా పశువులు అడ్డుపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిపై పార్కింగ్ స్థలాలు ఖాళీగానే కనిపిస్తున్నా.. దాబాహోటళ్ల వద్ద వాహనాల రద్దీ పెరిగిపోవడంతో ఎటువైపు నుంచి ఏం వస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది.

రహదారికి అడ్డదారులు

నేరుగా జాతీయ రహదారిపైకి వాహనాలు వచ్చేందు కు ఎక్కడా అనుమతులు లేకపోయిన అడుగడుగునా.. అడ్డదారులే దర్శనమిస్తున్నాయి. ఇలాంటి తప్పిదాలతోనే తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం నేరుగా ఎలాంటి అప్రోచ్ రోడ్డును నిర్మించరాదు. సర్వీసు రోడ్డు గుండానే రహదారి పైకి రావాల్సి ఉంటుంది. కానీ రహదారి వెంట అడుగడుగునా దాబాహోటళ్లను ఏర్పాటు చేస్తూ రహదారిని ధ్వంసం చేస్తున్నారు. రోడ్డుపైకి అటవీ జంతువులు, పశువులు రాకుండా దారికి ఇరువైపులా ముళ్ల కంచెను ఏర్పాటు చేసినా.. ధ్వంసం చేస్తున్నారు. అలాగే పలుచోట్ల ఇటుక బట్టీలు, వెంచర్లను ఏర్పాటు చేసి యథేచ్ఛగా అడ్డదారులను నిర్మిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ప్రమాదకర అడ్డదారులు జిల్లా రహదారిపై ఎన్నో దర్శనమిస్తున్నాయి. అయినా అధికారులు కట్టడి చర్యలు చేపట్టక పోవడంతో డెత్ స్పాట్‌లుగా మారి ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

మళ్లీ బస్సు కోసం బడి పిల్లల నిరీక్షణ

భీంపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బడి పిల్లలు చలిలో రాత్రి వేళ నిరీక్షించిన సరే మేము బస్సులు నడపం అంతే అన్నట్లున్నది ఆర్టీసీ అధికారుల ధోరణి. మండలంలోని కరంజీ(టి) ఉన్నత పాఠశాలలో పరిసర గ్రామాలు అయిన గోమూత్రి, అంతర్గవ్‌లకు చెందిన బాలురు, బాలికలు ఆయా తరగతుల్లో చదువుతున్నారు. మునుపటి సమయానికి బస్సులు ఉండి విద్యార్థులకు, సామాన్య ప్రజలకు ఇబ్బంది కాలేదు, ఇటీవలి కాలంలో ఆర్టీసీ వారు రోడ్డు బాగు లేదన్న కారణంతో అర్లి నుంచి బస్సులు వెనక్కి తిప్పుతున్నారు. దీంతో బడికి వెళ్లే సమయం, సెలవు తరువాత పొరుగు గ్రామాల విద్యార్థులు బస్సు లేక రాత్రంతా గంటల పాటు వేచి చూసి ఆ తర్వాత ఆటో లను ఆశ్రయిస్తున్నారు. తమ పిల్లల ఇబ్బందుల గురించి ఆ ప్రాంత నాయకులు, పిల్లల తల్లిదండ్రులు మొన్న ఆర్టీసీ ఆర్ఎం, డీఎంలను కలిసి విజ్ఞాపన చేశారు. తరువాత రెండే రెండు రోజులు బస్సులు నడిపి ఇప్పుడు ఆపివేశారు. కాగా, ఈ విషయమై స్థానిక గ్రామాల ప్రజలు కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తామని అన్నారు.

హైకోర్టు ఆదేశాలతో ఇల్లు సీజ్

ఇంద్రవెల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్నూర్ గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మించిన ఓ ఇంటిని హైకోర్టు ఆదేశాల మేరకు మండల తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ అధికారులతో కలిసి మంగళవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ హైకోర్టు ఆర్డర్ ఉత్తర్వులు డబ్ల్యూపి నెం. 26502 ప్రకారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని ఇల్లును మంగళవారం స్థానిక ఎస్సై ఇసాయన్న ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఇంటి నిర్మాణం కోసం ఎలాంటి అనుమతులు లేకపోవడంతో హైకోర్టు ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఇంటి యజమానులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, లేదంటే సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

కాగా, కొనుగోలు చేసిన ఇంటిని ఎలాంటి సమాచారం అందించకుండా అధికారులు సీజ్ చేయడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ మాదిగ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెండపెల్లి గ్రామానికి చెందిన కుంటాల నర్సయ్య అనే వ్యక్తి ముత్నూర్‌కు చెందిన బండారి నర్సయ్య ఇంటిని గ్రామస్థుల సమక్షంలో కొనుగోలు చేసినట్లు వివరించారు.



ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ రాజేశ్వర్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయండి

» హౌసింగ్ పీడీ రాజేశ్వర్

కుంటాల, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రాజేశ్వర్ అన్నారు. మంగళవారం కుంటాల మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణంపై ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లింబా(కే) గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించి ఇళ్ల నిర్మాణం పనులపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించిందని, ప్రతీ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడు నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసేలా అధికారులు లబ్ధిదారులకు ప్రతీరోజు సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రహీం, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషిచేద్దాం

» సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి రాజన్న

నిర్మల్‌రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయ సాధనకు కృషిచేద్దామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి రాజన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని శాస్త్రినగర్‌లో గల కార్యాలయంలో అమరవీరులకు సంతాపం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వందేళ్ల భారత కమ్యూనిస్టుల విప్లవ ఉద్యమంలో ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తమ విలువైన ప్రాణాలను త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్ష్మీ, గంగామణి, విజయ, రుక్మ, కవిత ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌ను తొలగించాలి

» కలెక్టర్ కార్యాలంలో వేణునగర్ గ్రామస్థులు, కుటుంబ సభ్యుల వినతి

పెంబి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అంగన్‌వాడీ టీచర్‌ను విధుల్లోంచి తొలగించాలని మంగళవారం వేణునగర్ గ్రా మస్థులు, బాధిత కుటుంబ సభ్యులు కలెక్టర్ కార్యా లయంలో కలెక్టర్, జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి (డీడబ్ల్యూవో)కి వినతిపత్రం అందజేశారు. వేణునగర్ గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్ నిర్ల క్ష్యం వల్లే గుంతలో పడి చిన్నారి మృతి చెందిందని అన్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని కోరారు.



వినతి పత్రం అందిస్తున్న గ్రామస్థులు

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

» పట్టణంలోని ప్రధాన వీధులగుండా కరసేవకుల పథ సంచాలక్

» పూలవర్షంతో స్థానికులు స్వాగతం

» పోలీసుల భారీ బందోబస్తు

నిర్మల్‌టౌన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా నిర్మల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో పథ సంచాలక్ సార్వజనికోత్సవం నిర్వహించారు. ముందుగా ఆయా కాలనీల నుంచి స్వయం సేవకులు పురవీధుల మీదుగా సభాస్థలికి చేరుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక క్షేత్ర సంచాలక్ శ్రీరామ్ భరత్ కుమార్ మాట్లాడుతూ 1925లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో విభిన్నరంగాల్లో దేశభక్తి పూరిత హిందుత్వ ఆధార సంస్థలతో పని చేస్తోందని, ప్రపంచంలోని అనేకదేశాల్లోనే విస్తరించిందన్నారు. సనాతనమైన ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు అనుగుణంగా కొనసాగుతున్న హిందూ జీవన విధానం విశ్వశాంతికి ఆధారమని, వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందన్నారు. దేశ అభివృద్ధి కోసం హిందువులు పంచపరివర్తన అంశాలను పాటించాలని కోరారు. హిందుత్వ జీవన విధానం విశ్వశాంతికి ఆధారం ప్రపంచంలోని వివిధ మంతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయన్నారు. దేశాభివృద్ధి కోసం హిందువులు పంచపరివర్తన కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, ముఖ్య అతిథులు శ్రీరామ్ భరత్ జి. రిటైర్డ్ ఐపీఎస్ ఎంకే సింగ్, చిటికేశ్ శ్రీనివాస్, నగర్ సంచాలక్ డా. ప్రమోద్ చంద్రారెడ్డి, స్వయం సేవలకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భరత్ కుమార్



పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు : ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వచ్చే అవకాశం ఉందని, ఆలయాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా.జి. జానకీ షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా బాసర సరస్వతీ దేవి ఆలయం, తానూర్‌లోని విఠలేశ్వర స్వామి ఆలయం, కదిలి పాపహరేశ్వర ఆలయం, నిర్మల్ పట్టణంలోని నగరేశ్వర స్వామి ఆలయం, దేవరకోట దేవస్థానం, వెంకటాపూర్‌లోని మహాదేవ ఆలయం, శివకోటి మందిరాలు వంటి ప్రధాన దేవాలయాలలో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ ఆలయాలకు వేల సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని, ఇందుకు గాను పోలీస్‌శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, పార్కింగ్ సదుపాయాలు, మహిళల భద్రతకు ప్రత్యేక సిబ్బంది, సీసీ కెమెరా పర్యవేక్షణ, పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఘనంగా ముందస్తు కార్తీక పౌర్ణమి వేడుకలు

ముథోల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని తులసి వివాహమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం తులసి వివాహం జరిపించారు. విద్యార్థులు తయారు చేసిన 1111 దీపాలను వెలిగించి కార్తీక దీపోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మపురి సుదర్శన్, పాఠశాల సమితి ఉపాధ్యక్షుడు ముత్యాల కిషన్, పాఠశాల సహ కార్యదర్శి దర్బార్‌నవీన్, పాఠశాల సభ్యులు కంది దత్తాత్రి, పాఠశాల ప్రధానాచార్యులు సారథి రాజు, అకాడమిక్ ఇన్‌చార్జి స్వప్న శర్మ, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముందస్తు కార్తీక పౌర్ణమి వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నిర్మల్‌రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలోని రైతాంగానికి తీరని నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్‌మోహన్ డిమాండ్ చేశారు. ముథోల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని అనేక మండలాలు, ముఖ్యంగా నిర్మల్,ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గం, భైంసా పరిధిలోని గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో వరి, పత్తి, సోయా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కోతకు వచ్చి కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం నీటిలో తడిసి మొలకెత్తే దశలో ఉందని అన్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం షరతులు, కోతలు లేకుండా గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేయాలని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు నిర్మల్ జిల్లా మహిళా ఇన్‌చార్జి లక్ష్మీ యాదవ్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనిల్ పవార్, సింగారే సునీల్, గడపాలే శ్రీధర్, చాకటి ఆనంద్, నాయకులు శివ, రాజేశ్వర్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రైవేటు కళాశాలల నిరసన

కుంటాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ కుంటాల మండలంలోని కల్లూరు వాసవి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రెండోరోజు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బకాయిలు చెల్లింపు విషయంలో దసరా, దీపావళిలోపు సీఎం, ముగ్గురు మంత్రులు కూడా హామీ ఇచ్చినా ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి, బిల్డింగ్ కిరాయిలు సైతం చెల్లించలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు సాయిలు, శ్రీనివాస్, కరస్పాండెంట్ హరి ప్రసాద్, జానకిరామ్, అధ్యాపకులు సిబ్బంది ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత

లోకేశ్వరం: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వేద నిధి డిగ్రీ కళాశాల యాజమాన్యం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సాయిలు మాట్లాడారు. నాలుగేళ్ల నుంచి డిగ్రీ కళాశాలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేవరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకం ఎంతో లాభదాయకం

మామడ, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పెరటికోళ్ల పెంపకం ఎంతో లాభదాయకంగా ఉంటుందని ప్రిన్సిపాల్, పరిశోధకుడు కృష్ణ అన్నారు. మండలంలోని వెంకటాపూర్, నల్లుర్తి గ్రామంలో పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో మంగళవారం ఐకార్ సహకారంతో గిరిజన గ్రామంలో పెరటి కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బలీగ్ హమ్మద్ పాల్గొన్నారు. గిరిజనులకు వంద మందికి 20 చొప్పున కోడి పిల్లలను పంపిణీ చేశారు. దాదాపు 100 గిరిజనులకు 20 చొప్పున కోళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కోళ్లు ఏడాదిలో 150కు పైగా గుడ్లను ఇస్తూ మూడు నెలల్లో కిలోన్నరకు పైగా మాంసం ఉత్పత్తి చేస్తాయన్నారు. గిరిజన ప్రాంతంలో వారికి అన్ని రకాల పోషక విలువలు, మాంసకృత్తులు అధికంగా ఉండే ఈ మాంసము, గుడ్డు లభిస్తాయన్నారు. పిల్లలు, గర్భిణీ, బాలింతలకు ఆరోగ్యకరమని అన్నారు. కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మహేష్, పొన్కల్ పశువైద్యాధికారి షరియర్, సిబ్బంది రాకేష్, లక్ష్మీ, హరీష్, తదితరులు పాల్గొన్నారు.



కోళ్లను పంపిణీ చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బది

ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందడుగు వేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్)నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తి కలిగిన రంగాల్లో నైపు ణ్యాలను మెరుగుపరుచుకోవాలని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ ఉన్నత లక్ష్యాల సాధన వైపు అడుగులు వేయాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు విద్యార్థుల సైన్స్ ప్రయోగాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. యూత్ ఫెస్టివల్‌లో భాగంగా వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు ప్ర దర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకటు కున్నాయి. కార్యక్రమంలో శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ సలోని చబ్ర, బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, డీఐఈఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈమేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... జిల్లాలోని 250 పాఠశాలలు, కళాశాలల్లో ఆరోగ్య పాఠ శాల ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. యూత్ ఫెస్టివల్ లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి కార్యక్రమాల్లోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు.

బిల్లులు మంజూరు చేయకుంటే పనులు చేయలేం

▸▸ జిల్లా కలెక్టర్‌కు బిల్డర్స్ అసోసియేషన్ వినతి

ఆదిలాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయకుంటే ఎలాంటి పనులు చేయలేమని బిల్డర్స్ అసోసియేషన్‌ఆఫ్ ఇండియా నాయకులు తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషాతో పాటు పంచాయతీరాజ్ ఎస్ఈ జాదవ్‌ప్రకాష్‌కు వినతి పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎం.రామారావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి బిల్లులు అందక పోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కొత్త పనులను చేయలేక పోతున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే డిసెంబర్ 1 నుంచి పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులను నిలిపి వేస్తామని పేర్కొన్నారు.ఇప్పటికైనా బిల్లుల విషయమై మంత్రులు, ముఖ్యమంత్రిని పలుమార్లు కలిసిన ఫలితం లేదన్నారు.ఇందులో కాంట్రాక్టర్స్ గుట్టనవీన్, ఎస్.కృష్ణారావు, గాజుల సదానంద్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలను సృష్టించిన వ్యక్తి అరెస్టు

మావల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలను సృష్టించి భూ కబ్జాకు పాల్పడ్డ వ్యకిని అరెస్టు చేసినట్లు మావల సీఐ స్వామి కర్రే తెలిపారు. పట్టణంలోని శాంతి నగర్‌కి చెందిన సబింకర్ శారదా మావలలోని సర్వే నెంబర్ 31లో ఓపెన్ ప్లాట్‌ను కొనుగోలు చేసింది. అయితే పిట్టలవాడకు చెందిన గొడ్డెండ్ల శ్రీనివాస్ ఆ ప్లాట్ పై కన్నేశాడు.... నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాకు పాల్పడ్డాడు... అసలు పట్టాదారు ప్లాట్‌కి కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడితే ఆ పనిని శ్రీనివాస్ అడ్డుకొన్నాడు. బాధితురాలు ఇచ్చిన పిర్యాదు మేరకు విచారణ మావల పోలీసులు చేపట్టారు. ఈ కేసులో పరారీలో మరో ముగ్గురు నిందితులను పట్టుకొని అరెస్టు చేస్తామన్నారు. కాగా శ్రీనివాస్ పై రౌడీ షీట్ ఉందని అనేక క్రిమినల్ కేసుల్లో ప్రమేయం ఉందని సీఐ స్వామి తెలిపారు.

నిర్లక్ష్యపు నీడలో ప్రభుత్వ ఆసుపత్రి

- 30 పడకల పర్యవేక్షణ లోపం
- ఐదు రోజులుగా రోగులకు రాని భోజనం
- వచ్చామా వెళ్లామా డాక్టర్ల తంతు
- మధ్యాహ్నం 12:45 గంటలకు రాని వైద్యులు
- బయోమెట్రిక్ లేకపోవడమే నిర్లక్ష్యానికి కారణమా?



ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న కుర్చీలు



30 పడకల ఆసుపత్రి



మూసిఉన్న గది

నర్సాపూర్(జి),నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని30 పడకల ఆసుపత్రి తీవ్రనిర్వహణ లోపాలతో అస్తవ్యస్తంగా మారింది. పేద రోగులకు అత్యవసర సేవలు అందడం లేదు. డాక్టర్లు ఉదయం వచ్చి కొద్దిసేపు ఓపీచూసి వెంటనే వెళ్లిపోతున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12:45 గం టల సమయంలో ఆసు పత్రిలో ఒక్క డాక్టర్ అందు బాటులో లేరు. డాక్టర్ల రాక- పోక సమయాలను ఖచ్చి తంగా నమోదు చేసే బయో మెట్రిక్ హాజరు వ్యవస్థ లేకపోవడమే ఈ సమయపా లన లోపానికి ప్రధానకారణం. అంతర్గత రోగులకు అందించాల్సిన మధ్యాహ్నభోజనం గతఐదురోజు లుగా నిలిచిపోయింది. జూనియర్ అసిస్టెంట్ అన్వేష్, నర్సింగ్ సిబ్బంది ఈవిషయాన్ని ధ్రువీకరిం చారు. భోజనం అందించకుండానే నకిలీ బిల్లులుతో మొత్తాన్ని స్వాహా చేశారనే తీవ్ర ఆరోపణలు గతంలో ఉం డటం, ప్రస్తు తం ఐదురోజుల గల్లంతుపైఅనుమానాలను పెం చుతోంది.

ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బయోమెట్రిక్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకొని బయోమెట్రిక్ వ్యవ స్థను ఏర్పాటు చేయాలని, కాంట్రా క్టర్‌పై, సమ యపాలన పాటిం చని డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకో వా లని మం డల ప్రజ లు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిర్వ హ ణ లోపాలపై ఉన్న తాధికారులు తక్ష ణ విచారణకు ఆదేశి స్తారా...? అనేది చూడాలి.

అధికారుల మొక్కుబడి

డీఎంహెచ్‌వో సూచన మేరకు పర్యవేక్షణ బాధ్యత కలిగిన డీసీహెచ్‌ఎస్ డా క్టర్ సురేష్ వివరణ కోరగా, ఉదయం సమావేశం జరి గిందని,అయితే భోజనం అందడం లేదన్న విషయం త నదృష్టికి రాలేదనిదాటవేశా రు. ఉన్న తాధికారులు తక్షణమే స్పందించి బ యోమెట్రిక్ వ్యవస్థఏర్పాటు చేయాలి

వైద్యులు అందుబాటులో ఉండడం లేదు



గాయానికి అత్యవస రంగా టీటీ ఇంజెక్షన్ కోసం భామ్ని(బి) గ్రామం నుంచి వచ్చాను. వైద్య సేవలు అందకపోవడంతోచేసేదేమీ లేక నర్సు వద్ద ఇంజెక్షన్ తీసుకుని వెళ్లాల్సి వచ్చింది.

- షేక్ మహ్మద్ మాజీద్

పశువుల దొంగలతో బెంబేలెత్తుతున్న రైతన్న

బోథ్/నేరడిగొండ,నవంబరు4(ఆంధ్రజ్యోతి):మండ లంలోని టీవీటీ గ్రామ రైతులకు చెందిన ఐదు పశువులను దొంగతనం చేసిన సంఘటన మరువక ముందే మండ లం పక్కనే ఉన్న నేరడిగొండ మండలంలోని చించోలిలో సోమవారం రాత్రిపశువుల దొంగలు రైతుపై దాడి చేసి గాయపరిచారు.దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. సాధారణంగా రైతులు తమ పశువులను తమ తమ పశువుల పాకలలో కట్టివేసి ఉంచడం జరుగుతుంది. కొంత మంది రైతులు తమ పొలాలలో ఉన్నపశువుల పాకలలోఉంచడం జరుగుతుంది. అయితే దొంగల తీరుచూస్తే రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతుల కళ్ల ముందే

గత వారం రోజుల క్రితం మండలంలోని టీవీటీ గ్రామం నుంచి పశువులను రైతుల ముందు నుంచి ఎత్తుకు వెళ్తున్నారు. పశువులను తరలిస్తుండగా టీవీటీ గ్రామానికి చెందిన గిరిజన వెంబడించడంతో దొంగలు ఒక పశువును విడిచి పెట్టి వెళ్లిపోయారు. తెల్లవారు జామున స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేయడం జరిగింది. దీంతో రైతులు తమ పశువుల రక్షణ కోసం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.



గాయపడిన వ్యక్తి

రైతు పై దాడి చేసి

చించోలి గ్రామంలో సీడం రవికి చెందిన ఎడ్ల జతను దొంగిలించే ప్రయత్నం చేశారు.దొంగతనానికి పాల్పడిన దొంగను అడ్డుకున్న రైతు పై కత్తి తో దాడి చేశారు. దీంతో రైతుల్లో మరింత ఆందోళన మొదలైంది. లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన ఎడ్లు పెంచుకున్న ఆవులు దొంగల పాలవుతుంటే రైతులు ఆవేదన గురవుతున్నారు. అసలే పంటలు పండక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నరైతులకు పశువుల దొంగలు ప్రాణ సంకటంగా మారారని వాపోతున్నారు.

కొండాపూర్‌లో కలుషితమైన తాగునీరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తాగునీటి పరీక్షలు చేస్తున్న అధికారులు

సిరికొండ,నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కలుషితమైన నీటి సమస్యపై అధికారులు స్పందించి సమస్యను పరిశీలించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో కొండాపూర్‌లో కలుషితమైన తాగునీరు శీర్షికను ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి సత్వర చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా కొండాపూర్ గ్రామానికి చేరుకున్న ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు మూగజీవాల మల మూత్రాలతో కలుషితమవుతున్న మంచినీటి బావిని గుర్తించి వెంటనే తగిన చర్యలు చేపట్టారు.ఈసందర్భంగా పంచాయతీ సిబ్బందితో బావిలో చేరుతున్న కలుషిత నీటితో పాటు..చుట్టూ పిచ్చిమొక్కలు తొలిగించి క్లోరినేషన్ ప్రక్రియను చేపట్టారు. అనంతరం తాగునీటి పరీక్షలు నిర్వహించారు.ప్రతిరోజూ సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్‌శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తుంది

▸▸ జిల్లా మేనేజర్ శ్రీనివాస్

లక్ష్మణచాంద, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల వినియోగం జీవితాన్ని నాశనం చేస్తుందని 'మిషన్ పరివర్తన్ - నాషా ముక్త్ భారత్' జిల్లా మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బాబాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆ ప్రోగ్రాం ప్రత్యేక కార్యక్రమంలో నిర్వహించిన అవ గాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, విద్యార్థుల భవిష్యత్తుపై వాటి ప్రభావాలను వివరించారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, సామాజిక సంబంధాలను తీవ్రంగా నాశనం చేస్తాయని, విద్యార్థులు ఆ మహమ్మారి నుంచి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే సంఘర్షణలు, నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ కార్యక్రమాలు, నిబంధనలను వివరించారు. 'నాషా ముక్త్ భారత్ అభియాన్' ద్వారా యువతను, పిల్లలను ఈ మత్తు పదార్థాల హానికర ప్రభావాల నుంచి రక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం అవగా హన కార్యక్రమాలు చేపడుతోందని, మత్తు పదా ర్థాల నుంచి దూరంగా ఉంటూ, ఆరోగ్యంగా, భద్రం గా జీవించాలనే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ప్రధానోపాధ్యాయురాలు సుజాత, అధ్యాపకుడు రామదాసు, నగేష్, కృష్ణప్ర సాద్, రాజన్న, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్, సెక్రటరీ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అండగా పోలీస్ అక్క ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థుల జీవితంలో జరిగిన అన్యాయాలు, అఘాయిత్యాలను ధైర్యంగా జిల్లా పోలీసులకు సమాచారం అందించాలని, వారిలో ధైర్యసాహసాలను పెంపొందించడానికి తమ వంతు ప్రయత్నంగా పోలీస్ అక్క కార్య క్రమా న్ని ప్రారంభిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ కళాశాల, పాఠశాలలో జిల్లాలో మొట్ట మొదటిసారిగా జిల్లా ఎస్పీ చేతుల మీదుగా పోలీస్ అక్క కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు జిల్లా పోలీస్ వ్యవస్థ మరింత చేరువ కావడానికి పోలీస్ అక్క పేరుతో ప్రతి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఒక మహిళ పోలీసు కానిస్టేబుల్‌తో పాఠశాల విద్యా ర్థిని విద్యార్థులకు, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించనున్నారు.ఇందులో భాగం గానే పాఠశాల బాలురకు..బాలికల పట్ల ప్రవర్తించవలసిన తీరును వివరించనున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన మహిళా పోలీసు వారానికి రెండు, మూడు రోజులు పలు పాఠశాలలను సందర్శించి వారితో సమావేశం నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని పోలీస్ అక్క ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ...విద్యార్థులకు జరిగిన అన్యాయాలు మరుగున పడకుండా ఇతరులకు అదే రీతిలో అన్యాయాలు జరగకుండా అడ్డుకోవడానికి జిల్లా పోలీసు యంత్రాంగం పోలీసు అక్క పేరుతో విద్యార్థులకు దగ్గర కానున్నారు. ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రోడ్లపై ఆకతాయిల వేధింపులపై, బాల్య వివాహాలపై, సోషల్ మీడియా వేధింపులపై, ఫేక్ సోషల్ మీడియా ద్వారా విద్యార్థులకు ఇబ్బందులు కలిగించడం, ప్రేమ పేరుతో వేధింపులు, ఫొ టోలను వీడి యోలను తీసుకొని వాటి ద్వారా బ్లా?యిలిం? పాల్పడడం లాంటి వాటిని ధైర్యంగా జిల్లా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధితుల పేర్లు బయ టకు రాకుండా సరైన న్యాయం చేసే దిశగా జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, డి.ఎస్.పి జీవన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సి పల్ లలిత కుమారి, పట్టణ సీఐలు కర్ర స్వా మి, సునీల్ కుమార్, ప్రభాకర్, నాగరాజు, ప్ర ణయ్ కుమార్, ప్రేమ్ కుమార్, అంజమ్మ, పోలీసు అక్క కార్యక్రమం విమెన్ కానిస్టేబు ల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



మృతుడు పూర్ణం అడెల్లు (ఫైల్)

కుంటాల,నవంబరు4:(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రం కుంటాలకు చెందిన పూర్ణం అడెల్లు (44) అ నే వ్యక్తి మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై అశోక్ తెలిపారు. పోలీసులు, కుటుంబీకులు కథనం మేరకుఅడెల్లు గతఆరు నెలల క్రి తం నూతనంగా ఇల్లు కట్టుకున్నాడు. అయితే ఈ ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షల వరకు అప్పు చే శాడు. చేసిన అప్పు ఎలా తీర్చాలని బెంగతో మంగళ వారం రోజు ఉదయం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు, మధ్యాహ్నం 1 గంటల సమయంలో ఆయన కుమారుడు వెళ్లి చూసే సరికి ఉరేసుకొని ఉన్నట్లు గమనించిన ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

పెంబి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మేఘావత్ వినోద్ అనే వ్యక్తి ఎండు గంజాయిని ద్విచక్ర వాహనంపై రవాణా చేస్తుండగా మంగళవారం పట్టుకున్నట్లు నిర్మల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ రంగస్వామి తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ నుంచి నిర్మల్ తీసుకెళ్తుండగా నిర్మల్ పట్టణంలోని కొండాపూర్ బ్రిడ్జి వద్ద మేఘావత్ వినోద్ అనే వ్యక్తిని పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 1.710 కిలోల ఎండు గంజాయి, ద్విచక్ర వాహనం, చరవాణి స్వాధీనం చేసుకున్నామన్నారు. వినోద్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరు పరుచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అభిషేకర్, వసంతరావు, సిబ్బంది వెంకటేష్, హరీష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి కారాగార శిక్ష

▸▸ జిల్లా న్యాయాధికారి శ్రీవాణి

నిర్మల్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఒకరికి 20 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.5000ల జరిమానా విధించినట్లు జిల్లా న్యాయాధికారి శ్రీవాణి తెలిపారు. 2020 సంవత్సరంలో కడెం మండలం చిన్న క్యాంపు కన్నాపూర్ గ్రామానికి చెందిన గట్టు గంగారాం అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన 9 ఏళ్ల చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘోర ఘటనపై కడెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ సందర్భంగా సంబంధిత సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించిన తరువాత, మంగళవారం జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు - పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయాధికారి శ్రీవాణి నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధించడంతో పాటు రూ. 5,000ల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎస్పీ తెలిపారు. నిర్మల్ పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ న్యాయం నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసి న పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు, విచారణ అధికారులు ఉపేందర్‌రెడ్డి, రాజ్ కుమార్, డ్యూటీ ఆఫీసర్స్ అయిన ఏఎస్సై డల్లుసింగ్, హెచ్‌సి. ప్రభా కర్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సీసీఐ నిర్ణయంతో నష్టపోనున్న రైతులు

బోథ్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పత్తి పంట కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు ఎకరానికి ఏడు క్వింటాళ్ల మేరకే పత్తి పంటను కొంటామని నిర్ణయం తీసుకోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోనున్నారని రైతులు వాపోతున్నారు. మొదట ఎకరానికి 11 క్వింటాళ్ల 74 కిలోలు కొనేవారని అయితే ప్రస్తుతం ఏడు క్వింటాళ్లు మాత్రమే ఉంటామని తీసుకున్న నిర్ణయం రైతులు ఇబ్బందుల పాలు చేసే విధంగా ఉందని రైతులు వాపోతున్నారు. అధిక వర్షాల వల్ల పంట దిగుబడి రాక రైతులు నష్టపోతుంటే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని వాపోతున్నారు. ఓవైపు కిసాన్‌యాప్‌ను అమలు చేయడం వల్ల రైతులు ఇప్పటికే ఇబ్బందులకు గురవుతున్నారు. పంట కొనుగోళ్లలో కోత విధించడం రైతులను ఇబ్బందుల పాలు చేయడం అని పలువురు పేర్కొంటున్నారు.

రైతులను దగా చేయడమే



కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల సీసీఐ అధికారులు ఎకరానికి పత్తి 7 క్వింటాళ్ల వరకు కొంటాం అనడం సరైనదికాదని ఇది రైతులను ఇబ్బందులు పాలుచేయడం మాత్రమేనని సోనాలమండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజులపోతన్న విమర్శించారు.తక్షణమే కేంద్రం ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

- గాజుల పోతన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆందోళనలు చేపడతాం

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని లేకుంటే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బత్తుల రమేష్ డిమాండ్ చేశారు.

- బత్తుల రమేష్, కాంగ్రెస్ నాయకులు

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

▸▸ నషా ముక్త్ భారత్ అభియాన్‌లో ఎస్సై జ్యోతిమణి

ఖానాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఖానాపూర్ అదనపు ఎస్సై జ్యోతిమణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం దేశంలో 6.5 కోట్ల మంది యువత డ్రగ్స్‌కి బానిసగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చెడు మార్గంలో కాకుండా మంచివైపు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు రాకేష్, రాజశేఖర్, లోకేష్, మధుకర్, సంజయ్, రోహిత్, పాఠశాల ఉపా.ధ్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై జ్యోతిమణి

అంబులెన్స్‌లోనే గిరిజన మహిళ ప్రసవం



మహిళను ఉట్నూర్ ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఉట్నూర్,నవంబర్4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసళ్లపోడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ 108 అంబులెన్స్ లోనే ప్రసవించింది. ముసళ్ల పోడు గ్రామానికి చెందిన శ్రీకాంత్ సతీమణి అనిత అబ్బాయికి పురిటి నొప్పులు రావడతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈఎంటీ ప్రవీణ్‌కుమార్ అజ్మీరా, పైలెట్ రవీందర్ 108 అంబులెన్స్‌తో గ్రామానికి చేరుకుని ఉట్నూర్ సివిల్ ఆసుపత్రికి తరలిస్తుంగా మార్గమధ్యంలో తాండ్ర వద్ద పురిటి నొప్పులు తీవ్రం కావడంతో సోమవారం రాత్రి 108 ఈఎంటీ ప్రవీణ్‌కుమార్ వెంటనే అంబులెన్స్‌ను పక్కన నిలబెట్టి అంబులెన్స్‌లో ప్రసవం పూర్తి చేశారు. ప్రణితబాయి మగబిడ్డకు జన్మనివ్వడంతో 108 సిబ్బంది తల్లిని బాబును మరింత ఆరోగ్య సేవలు పొందడానికి ఉట్నూర్ సివిల్ ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు

నేరడిగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారుల విధులకు ఆటంకం కలిగించి నందుకు మండలంలోని పాషా తండాకు చెందిన బర్దవల్ రవి, బర్దవల్ జీవన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో గణేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని గుత్పల్ల అటవీ నుంచి అక్రమ ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు అటవీ శాఖ సిబ్బంది దుద్ గండి ప్రాంతంలో టీఎస్‌వోఐఈకే ట్రాక్టర్‌లో అక్రమ (ఇసుక) స్యాండ్ తరలిస్తుండగా సిబ్బంది ట్రాక్టర్ ఆపినప్పుడు వారితో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా మీరు ఎం చేసుకుంటారో చేసుకోమని అతివేగంగా ట్రాక్టర్‌ను పాశతండాలో గల తమ ఇంటివద్ద ఇసుకను ఖాళీ చేయగా సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్ తీసుకుని రావాలని కోరగా సిబ్బందిపై కుటుంబ సభ్యులు దురుసుగా ప్రవర్తించడంతో ఇద్దరిపై, అటవీ చట్టం ప్రకారం అటవీ కేసు నమోదు చేయడం జరిగిందని ఎఫ్‌ఆర్‌వో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాజేశ్వర్ (ఫైల్)

నర్సాపూర్(జి),నవంబరు 4(ఆంధ్ర జ్యోతి) : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండ లం పరిధిలోని రాంపూర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో టాటా ఏసీ డ్రైవర్ రాజేశ్వర్ ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రంగాగాయపడిన రాజేశ్వర్ నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దుర్మరణం చెందారు.నిర్లక్ష్యంగా వేయని ట్రాక్టర్ డోర్ వల్లే ఈఘోరం జరగడంతో మండలంలో విషాదచాయలు అలుముకు న్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాలు

ప్రమాదం తీవ్రత దృష్ట్యా జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల స్వయంగా రాంపూర్ సంఘటన స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు. అనంతరం నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో ఏఎస్పీ రాజేష్ మీనా, నర్సాపూర్(జి) మండల తహసీల్దార్ శ్రీకాంత్ గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందిని ఆదేశించారు.

ప్రజల డిమాండ్: నిర్లక్ష్యంతో ప్రాణ నష్టానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించే వాహనాలపై రవాణా, పోలీసు శాఖ ఉక్కుపాదం మోపాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ముథోల్‌లో ఉపాధిహామీ పనులపై గ్రామసభ

ముథోల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామసభ ఏర్పాటుచేసింది. గ్రామంలో జరగని పనులపై జరిగినట్లు గుర్తించినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. పని చేయకుండా డబ్బులు తీసుకోవడం, ఒకచోట చేయాల్సిన పని మరొకచోట చేయడం, మాస్టర్‌లో దిద్దుబాటు అక్రమాలు బయటపడ్డట్లు ఎస్ఆర్‌పీ మహేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శివ కుమార్, ఏపీవో శిరీషా రెడ్డి, ఈవో అన్వర్, ఈజీఎస్ టీఏలు, సామాజిక తనిఖీ బృందం, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

నిర్మల్‌రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ఎక్సైజ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 6న పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎండీ రజాక్ మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి జోనల్ లెవెల్ క్రీడా పోటీలు

నిర్మల్ రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): 11వ జోనల్ లెవెల్ క్రీడాపోటీలను ఈనెల 6 నుంచి 8 వరకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం లెఫ్ట్ పోచంపాడ్‌లో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతున్నారని పేర్కొన్నారు.



ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

బాధిత కుటుంబానికి
ఎల్‌వోసీ అందజేత


సోన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన లాలాబాయి అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు మెరుగైన చికిత్స నిమిత్తం రూ.2.75లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ చెక్కును మంగళవారం కుటుంబ సభ్యులకు బీజేఎల్పీనేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఎల్‌వోసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు లబ్ధిదారు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి, నాయకులున్నారు.

ఆసుపత్రి తనిఖీ

ముథోల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ముథోల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్) డా.సురేష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. అలాగే కంటి సమస్యలతో వచ్చిన రోగులకు డా.సురేష్ స్వయంగా పరీక్షించారు. అయనవెంట డీసీహెచ్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌జాదవ్, డా.మల్లికార్జున్, డా.వనజ, తదితరులున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీసీహెచ్



• జిల్లా కేంద్రంలోని భీమన్న గుట్ట ఇదే..



గుట్టపై ఉన్న ఆలయం ఇదే

'గుట్ట'కాయ స్వాహా

- భీమన్న గుట్టపై కబ్జాదారుల కన్ను
- చరిత్రను చెరపడుతున్న ఆక్రమణదారులు
- కోట్ల రూపాయల విలువైన భూమికి ఎసరు
- పాలకులకు పట్టని ముదిరాజ్‌ల ఆందోళన

రూ.కోట్ల విలువైన చారిత్రక భీమన్నగుట్ట భూమిని కబ్జాదారులు ఆక్రమిస్తూ చరిత్రను చెరబడుతున్నారు. శతాబ్దాల నుంచి ముదిరాజ్ కులస్థులకు కులదైవంగా పిలుచుకునే భీమన్నదేవునికి సంబంధించిన ఈ గుట్టను దశల వారిగా ధ్వంసం చేస్తూ ఆ భూమి అంతా ఆక్రమిస్తున్నారు. ఇప్పటికే ఈ గుట్టకు సంబంధించిన భూమి పెద్దఎత్తున ఆక్రమణకు గురికాగా.. మిగిలిన భూమినీ కబ్జా చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

నిర్మల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో సర్వేనంబర్ 530 పరిధిలోని 63.11 ఎకరాల భూమిపై ఈ గుట్టపై ఉంది. అయితే ఏళ్ల నుంచి ముదిరాజ్‌లు తమ వారసత్వ సంపదగా ఈ గుట్టను భావిస్తూ ఈ భీమన్నదేవునికి పూజలు చేసుకుంటున్నారు. అయితే కొన్నేళ్ల క్రితం నుంచి కూడా ముదిరాజ్ కులస్థులు ఈ గుట్ట భూమిపై సహజంగా పెరిగే పండ్ల చెట్లను జీవనోపాధిగా చేసుకుంటున్నారు. అయితే ఈ భూమిని ముదిరాజ్ కులస్థులకు జీవనోపాధి కోసం కేటాయించాలని కూడా ఆ కులస్థులు ఇప్పటికే ప్రభుత్వానికి పలుసార్లు నివేదించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు సైతం వారు వినతిపత్రాలు అందించారు. ఈ క్రమంలోనే ఈ గుట్ట భూమిని మెడికల్ కాలేజీకి కేటాయించారు. అలాగే ఈగుట్టపై కొంత భూమిని కొంతమంది పలుకుబడి గల వ్యక్తులు అక్రమంగా పట్టా చేసుకొని క్రషర్ దందా కోసం కొల్లగొడుతూ వస్తున్నారు. క్రమంగా గుట్టను ధ్వంసం చేస్తూ మైదానంగా మారుస్తున్నారు. అయితే ఈ గుట్ట భూమిని కాపాడి ఉపాధి కోసం ముదిరాజ్‌ల సంఘానికి కేటాయించాలని గతకొద్దిరోజుల నుంచి నిర్మల్‌లో ఆ కుల సంఘానికి చెందిన సభ్యులు ఆందోళన చేస్తున్నారు.

ఇప్పటికే సగానికి పైగా కబ్జా

భీమన్నగుట్టను ఇప్పటికే కబ్జాదారులు అక్రమ పట్టాలు, తప్పుడు రికార్డులతో సగానికి పైగా కబ్జా చేసినట్లు ఆరోపణలున్నాయి. అప్పటి అధికారపార్టీ నాయకులు తమ పలుకుబడి పరపతిని ఉపయోగించి సంబంధిత రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి గుట్ట భూమిని పట్టాలుగా మార్చుకొని విధ్వంసం చేశారు. కంకర దందా కోసం ఈ గుట్టను వారంతా ప్రధాన వనరుగా వాడుకున్నారు. మైనింగ్‌తో కోట్ల రూపాయలు ఆర్జించిన వ్యక్తులు ఇక ఈ గుట్టను మొత్తంగా కొట్టేయాలని ప్లాన్ చేస్తున్నారు. కొంతమంది ఈ భూమిలో ప్లాట్లు చేసి రియల్ ఎస్టేట్ దందాను సైతం మొదలుపెట్టారు. పట్టణ నడిబొడ్డున ఉన్న భీమన్నగుట్ట భూమి కోట్ల రూపాయలు విలువ చేస్తుండడంతో కబ్జాదారుల కళ్ళన్నీ ఇటువైపే కేంద్రీకృతమవుతున్నాయని అంటున్నారు.

ముదిరాజ్‌ల ఇంటి దైవం

భీమన్నగుట్టపై ముదిరాజ్‌లు యేళ్లనుంచి పూజలు చేస్తుండడం సంప్రదాయంగా వస్తోంది. ఈ గుట్టపై ఉన్న భీమన్న దేవునికి ప్రతీయేటా నిర్మల్‌లోని ముదిరాజ్ కులస్థులంతా పెద్దఎత్తున పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక్కడ చిన్నపాటి జాతరను కూడా నిర్వహిస్తారు. తమ కులదైవమైన భీమన్నను కొలుచుకుంటున్న భూమిపై కబ్జాదారుల కళ్లు పడడం వివాదాస్పదంగా మారుతోంది. భూమిని కబ్జాదారుల కోరల నుంచి కాపాడాలంటూ ముదిరాజ్ కులసులంతా గత కొద్దిరోజుల నుంచి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారు.

తీవ్రమవుతున్న ఆందోళనలు

భీమన్నగుట్ట ఆక్రమణలపై జిల్లాలోని ముదిరాజ్‌లు అంతా ఏకమై పోరుబాటకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులందరికీ గుట్టను కాపాడాలంటూ వినతిపత్రాలు సమర్పించిన ముదిరాజ్‌లు ఇక ప్రత్యక్ష ఆందోళనకు కార్యాచరణ రూపొందించారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని కలిసి సమస్యను అయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ అభిలాష అభినవ్‌లు స్వయంగా ఆక్రమిత స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యేను సైతం కోరారు. ముదిరాజ్‌లు మాత్రం పట్టువీడకుండా భీమన్నగుట్టను ఆక్రమణల నుంచి కాపాడాలంటూ గళమెత్తుతున్నారు. రాబోయే రోజుల్లో భీమన్నగుట్టను రక్షించేందుకు చేపట్టబోయే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామంటూ ఆ కుల సంఘాల ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- లేదంటే డిసెంబరు నుంచి పనులను నిలిపి వేస్తాం
- కాంట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్‌కు వినతి

నిర్మల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి గత రెండు, మూడేళ్లుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే వాటిని బిల్లులను చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ రామారావు కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలని విజ్ఞప్తిచేశారు. చాలా మంది కాంట్రాక్టర్లు అప్పులు చేసి పనులు పూర్తి చేశారని, ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈనెల 30లోపు బిల్లులు చెల్లించకపోతే డిసెంబరు నుంచి ప్రస్తుతం కొనసాగుతున్న పనులను నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు విద్యాసాగర్‌రావు, లక్కడి జగన్మోహన్‌రెడ్డి, ప్రకాష్ ధనానివాల, సదాశివరెడ్డి, దేవేందర్ రావు, హరిమోహన్ రావు, శ్రీధర్ రావు, అరుణ్ రెడ్డి, నవీన్‌గౌడ్, పొద్దుటూరి రవీందర్ రెడ్డి, అర్జున్ రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి

- సుదర్శన్ రాథోడ్ మండల ప్రత్యేక అధికారి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సుదర్శన్ రాథోడ్

ముథోల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ రాథోడ్ సూచించారు. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక గ్రామ అధికారులు, ఇతర విభాగాల సిబ్బందితో ఆయన మండలాభివృద్ధి కార్యాలయంలో మంగళవారం రివిజన్ సమావేశం నిర్వహించారు. మొదటి విడతలో 423 ఇళ్లకు గాను 314 ఇళ్లకు మార్కౌట్ ఇవ్వగా, 218 ఇళ్లు బేస్మెంట్ లెవల్ వరకు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా 96 ఇళ్లు రూఫ్ లెవల్ కాగా 27 ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు పనులు అయినట్లు తెలిపారు. లబ్ధిదారులు స్వయంగా ఇళ్లు కట్టుకునేలా అవగాహన కల్పించాలని, పనుల నాణ్యతపై రాజీ పడకూడదని అధికారులకు తెలిపారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాశాఖ విషయమై ఎంఈవో రమణారెడ్డికి ఎఫ్ఆర్ఎస్ పెంపుపై చర్యలు తీసుకోవాలని, టీచర్లు విద్యార్థుల వివరాలను సమయానికి అప్డేట్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో లవ కుమార్, ఎంపీవో శివ కుమార్, హౌసింగ్ డీఈఈ దయానంద్, ఏఈ శివరాం, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న నివారణ ఉద్యమ కమిటీ నాయకులు

కోతుల నివారణకు చర్యలు చేపట్టండి

- ఖానాపూర్‌లో ర్యాలీ
- ప్రభుత్వ కార్యాలయాలలో వినతి పత్రం

ఖానాపూర్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): నిత్యం కోతుల దాడులతో వేగలేకపోతున్నామని, వాటి నివారణకు చర్యలు చేపట్టాలని పార్టీలకు అతీతంగా ఖానాపూర్‌లో పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఖానాపూర్‌లో పార్టీలకు అతీతంగా కోతుల నివారణ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ చౌక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో కోతుల సమస్యపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంది రామయ్య, వీడీసీ అధ్యక్షుడు బీసీ రాజన్న, జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు అబ్దుల్ వకీల్, ఏ. సంజీవ్ రావు మాట్లాడుతూ కోతులతో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. కోతుల సమస్యకు పరిష్కారం చూకపోతే రానున్న ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చే నాయకులకు బుద్ధి చెబుతామన్నారు. ఆదివారం పార్టీలకు అతీతంగా ప్రజలతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఖానాపూర్ మాజీ ఉప సర్పంచ్ కారింగుల సుమన్, నాయకులు ఎనగందుల నారాయణ, కిషన్ రెడ్డి, బీసీ రమేష్, వాహబ్, తదితరులు ఉన్నారు.

వెంకన్న జాతరకు వేళాయే..

- నేడు ఖానాపూర్‌లో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం
- ఆలయ ఆవరణలో ఘనంగా సుదర్శన యాగం



పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు



ముస్తాబైన ఆలయం

ఖానాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో గల శ్రీశ్రీశ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ 41వ వార్షిక బ్ర హ్మోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకలలో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో మహాలక్ష్మి యా గం, సుదర్శన యాగాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం ప్రారంభం కానున్న వెంకన్న జాతరకు సర్వం సిద్ధమైంది. నేటిరాత్రి నుంచి రేపు తెల్లవారు జాము వరకు ఖానాపూర్‌లో శ్రీవారి రథోత్సవం, జాతర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నారు. కార్తీక పౌర్ణమివేళ నిర్వహించే ఈ జాతరకు నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకు లు తెలిపారు. మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన ఏర్పాటుచేసినట్లు దేవస్థానం కమిటీ అధ్యక్షుడు రాజన్న తెలిపారు.

దూది రైతు దుఃఖం

- ఎకరానికి ఏడు క్వింటాళ్లే కొనుగోలు పరిమితి
- సీసీఐ కేంద్రాల్లో కొత్త నిబంధన
- కొత్త నిబంధనను విధించిన కేంద్ర ప్రభుత్వం
- ఆందోళనలో పత్తి రైతులు
- నిబంధనను ఎత్తివేయాలని రైతుల డిమాండ్



భైంసా, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పరిహాసం, ప్రతికూల పరిస్థితులతో విలవిల్లాడిపోతున్న పత్తి రైతులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కొత్త నిబంధనను కేంద్రం అమలుల్లోకి తెచ్చింది. ఈతాజా నిబంధన ప్రకారం ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేయాలనే పరిమితిని విధించింది. ఇదివరకు ఎకరానికి 12 క్వింటాళ్ల మేర కొనుగోళ్ల పరిమితి ఉండగా.. ప్రస్తుతం ఏడు క్వింటాళ్లకు మాత్రమే పరిమితి చేస్తూ నిబంధనలు జారీ అయ్యాయి.

జిల్లాలో 1.46 లక్షల ఎకరాల్లో పత్తిసాగు

జిల్లాలోని నాలుగు వ్యవసాయ డివిజన్ల పరిధిలో ఈ వానకాలపు సీజన్‌లో సుమారు 56 వేలకు పైగా రైతులు 1.46 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. అత్యధికంగా భైంసా, ముథోల్ వ్యవసాయ డివిజన్ల పరిధిలో పత్తిను అధికంగా పండించారు. అయితే విత్తనాలు విత్తే సమయంలో వాతావరణం అనుకూలించకపోయినా తదుపరి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో పత్తి పంట ఆశాజనకమైన స్థితికి చేరింది. పంట పరిస్థితి మెరుగ్గా ఉండటంతో దిగుబడులపై అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. కష్టనష్టాలు దూరమవుతాయని, మంచి లాభాలు పొందుతామని కలలు కన్నారు. అయితే ఇదే సమయంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని దిగుబడులపై ప్రభావం చూపాయి. అయినా పలు ప్రాంతాల్లోని రైతులు ప్రతికూలతలను అధిగమించి ఆశించిన మేర దిగుబడులను సాధించారు. ఇలాంటి రైతాంగం సీసీఐ కేంద్రాలలో విధించిన పరిమితి నిబంధనలతో కుదేలవుతున్నారు.

ఆందోళనలో దూది రైతులు

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పరిమితి విధింపుపై పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్ని రకాల ప్రతికూలతలను ఎదుర్కొని వ్యయ, ప్రయాసాలకు ఎదురొడ్డి సాధించిన దిగుబడులపై పరిమితులు విధించడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఏడు క్వింటాళ్లకే పరిమితం చేస్తూ నిబంధనలను విధించడం ఎంతవరకు సబబంటూ పత్తి రైతులు ప్రశ్నిస్తున్నారు. పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కొనుగోళ్లపై విధించిన పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పరిమితి నిబంధనను ఎత్తివేయాలి



• ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రైతు సంఘం ప్రతినిధి, ముథోల్

ప్రభుత్వం పత్తి రైతుల మేలు కోరుకుంటే ఏడు క్వింటాళ్ల పరిమితి నిబంధనను ఎత్తివేయాలి. ఇది వరకు ఉన్న 12 క్వింటాళ్ల పరిమితినే కొనసాగించాలి. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలి.

తేమశాతం నిబంధనలను సడలించాలి



• డా.కిరణ్ కోమ్రేవార్, బీఆర్ఎస్ సమన్వయ కమిటీ ప్రతినిధి, ముథోల్

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం నిబంధనలు సడలించాలి. భారీ వర్షాలు, మొంథా తుఫాన్ పత్తి దిగుబడులపై ప్రభావం చూపాయి. వర్షాలతో పత్తిలో తేమ శాతం పెరుగుతూ పోతోంది. నిబంధనలో సడలింపులు చేపట్టకపోతే పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారు. కొనుగోలు పరిమితిపై కేంద్రం తాజాగా నిబంధలను ఎత్తివేయాలి.